హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ నూతన కార్యవర్గం

కాచిగూడ: హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ నూతన కార్యవర్గాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి మంగళవారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో ప్రకటించారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కన్నె రమేష్‌యాదవ్, జేఎల్ రాహుల్ చంద్ర, పందిళ్ల ప్రసాద్, ఎం.శ్యామ్‌రాజ్, పి.వీణారెడ్డి, కె.గంగరాజు, ప్రధాన కార్యదర్శులుగా గడ్డం వెంకటస్వామి, డి.ప్రేమ్‌కుమార్, ఎడెల్లి అజయ్ కుమార్, కార్యదర్శులుగా ఎక్కాల ఉదయ్ కుమార్, జి.శ్రావణ్‌యాదవ్, కొల్లూరు పవన్‌కుమార్, కోలన్ సత్యనారాయణ, సుప్రీయగౌడ్, నర్సింగ్ ముదిరాజ్, కోశాధికారిగా ఎ.సూర్యప్రకాష్ సింగ్, ఆఫీస్ కార్యదర్శిగా ఎం.రవీందర్‌గౌడ్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా బి.గణేష్‌కుమార్, మీడియా కన్వీనర్‌గా బుజేందర్ కుమార్ వీరబోయిన, ఐటి ఇన్‌చార్జిగా రజనీని నియమించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కాచిగూడ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సూచించారు. మంగళవారం హిమాయత్‌నగర్ మండల రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్, నల్లకుంట కార్పొరేటర్ వై.అమృతలతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కల్యాణలక్ష్మి 18, షాదీముబారక్ 4 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, ఏఎస్ఓ దీప్తి, బీఆర్ఎస్, బీజేపీ నేతలు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి కృషి



హైదరాబాద్ మోటర్ డ్రైవింగ్ స్కూల్ అసోసియేషన్ కార్యవర్గంతో అధ్యక్షుడు కె.ఉపేందర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైదరాబాద్ మోటర్ డ్రైవింగ్ స్కూల్ (ఎల్ఎంవీ) అసోసియేషన్‌ను మంగళవారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా కె.ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా సాయిరాం, కోశాధికారిగా సోమేష్, ఉపాధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి, రవీందర్, జాయింట్ సెక్రటరీగా పి. సతీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.రమేష్,షేక్ వాజిద్, కుమార స్వామి, సలహాదారులుగా సిహెచ్ వీరన్న, చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా సాయిరెడ్డితో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు కె. ఉపేందర్ మాట్లాడుతూ... మోటర్ డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు.

తులసి మొక్కల పంపిణీ



మట్టి గణపతులు, తులసి మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నల్లకుంట ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పాత నల్లకుంట రామాలయం వద్ద స్థానికులకు పర్యావరణ గణపతులు, తులసి మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి హాజరైన కార్పొరేటర్ వై.అమృత స్థానికులకు మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్.నర్సింగ్‌రావు, ప్రశాంత్ కుమార్ జోషి, నల్లకుంట కన్వీనర్ జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లను తొలగించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లి నుంచి బాగ్‌లింగపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన శిథిలావస్థకు ప్రమాదకరంగా ఇళ్లను వెంటనే తొలగించాలని జోనల్‌కమిషనర్ రవికిరణ్, డీఎంసీ రామానుజులరెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేంద్రకు మంగళవారం స్థానికులు మహేష్‌కుమార్, శ్రావణ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... చిక్కడపల్లి మెయిన్ రోడ్‌లోని ఓ ఇల్లు బీటలు వారి ప్రమాదకరంగా ఉందన్నారు. అది ఏ సమయంలోనైనా కూలే అవకాశం ఉందని తెలిపారు. అందులో 3 మడిగల్లో వ్యాపారాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన ఇళ్లను తొలగించాలని కోరారు. సదరు ఇంటి యజమానికి తొలగించాలని మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదన్నారు.

పూజలకు దేవాలయాల ముస్తాబు

నేటి నుంచి లక్ష్మీగణపతి దేవాలయంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు



చిక్కడపల్లి: ఏ పని తలపెట్టినా విఘ్నాలు రాకుండా ఉండేందుకు విఘ్నేశ్వరుడిని భక్తితో కొలుస్తాం. భక్తులు వివిధ రూపాల్లో ఉండే వినాయకులను పూజిస్తారు. మన పురాణాల్లో మొత్తం 32 గణాధిపతులు ఉన్నారు. అందులో శ్రీ లక్ష్మీగణపతి రూపం ఒకటి ఈ విఘ్నేశ్వరుడి వామాకంపై లక్ష్మీదేవి ఆసీనులై ఉంటుంది. ప్రసన్న వదనంతో ఆసీనురాలైన లక్ష్మీదేవి ఏ భక్తులకు ఐశ్వర్య అభివృద్ధిని కలుగజేస్తుందని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయానికి వచ్చే భక్తుల సమ్మకం స్వామివారు ఎంతో నమ్ముతారు. వినాయక చవితి నేపథ్యంతో దేవాలయాన్ని అలంకరించారు. వినాయక నవ రాత్రి ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఎం.నర్సింగ్‌రావు, ఈవో పి.లక్ష్మారెడ్డిలు తెలిపారు. త్యాగరాయ గానసభ లేన్‌లో ఉన్న శాంతినికేతన్ గ్రౌండ్‌లో ధ్యాన గణేశ్ మందిర్‌లోనూ నిత్యం పూజలు ఉంటాయని ఆలయం నిర్వాహకులు తెలిపారు. దోమలగూడలోని రామకృష్ణమఠం ఎదురుగా ఉన్న శృంగేరి పీఠం విజయగణపతి దేవాలయంలోనూ నిత్యం గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిప్రవృత్తులతో జరుగుతాయని ఆలయ కమిటీ పేర్కొంది.

నేటి నుంచి ప్రత్యేక పూజలు...

ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులు నిత్యం ఉదయం 6గంంటలకు సుప్రభాతం బిందె తీర్థం, 8గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 9.30 గంటలకు గణపతి హవనం, 11.30నుంచి స్వర్ణపుష్పార్చన, సాయంత్రం 5.15కు లక్ష్మీగణపతి దేవస్థాన మహిళా భక్త బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా, శ్రీ విష్ణు సహస్రనామ, లలిత సహస్రనామ పారాయణం జరుగుతాయి. రాత్రి 7.30 గంటలకు పల్లకీసేవ, నివేదన, హారతి, మహామంత్రపుష్పం, తీర్థ ప్రసాదం వితరణ జరుగుతుందని తెలిపారు.

ఆలయ (చరిత్ర) ప్రాసస్తి...

ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో సుదర్శన్ థియేటర్ ఎదురుగా ఉన్న స్థలంలో శ్రీ లక్ష్మీగణపతి ఆలయం నిర్మించమని శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు చంద్రశేఖర సరస్వతీ స్వామివారు ఆదేశించారు. ఈ పీఠాధిపతి చెప్పిన విధంగా భక్తులు లక్ష్మీగణపతి ఆలయాన్ని 1968లో నిర్మించారు. ఆ తర్వాత క్షీర లింగేశ్వరస్వామి, కోదండరామస్వామి, ప్రసన్నాంజనేయస్వామి, బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయాలను నిర్మించారు. అదే విధంగా నవగ్రహాల మండపం, హోమ మండపం నిర్మించారు.



గణపతి నవరాత్రి మహోత్సవాలకు ముస్తాబైన ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయం

భక్తితో కొలిస్తే..



లక్ష్మీగపతి ఆలయానికి 60 ఏళ్లుగా ఇక్కడికి వచ్చి పూజలు చేస్తున్నాను. స్వామిని భక్తితో కొలిస్తే అంత మంచే జరుగుతుంది. భక్తితో కొలుస్తే వృద్ధిలోకి వస్తారని నమ్ముతాం. అందుకే సిరి సంపదలను ఇచ్చే లక్ష్మీగణపతిగా భక్తులు కొలుస్తారు. – ఎ.లోకమ్మ, స్థానికురాలు

నా ఇష్ట దైవం..



నా ఇష్టదైవం లక్ష్మీగణపతి. గతంకంటే ప్రస్తుతం ఎంతో అభివృద్ధి చెందింది. నేను చిన్నప్పటి నుంచి ఈ ఆలయానికి వస్తున్నాను. – జయశంకర్, చిక్కడపల్లి

ఏర్పాట్లు పూర్తి



శ్రీ లక్ష్మీగణపతి ఆలయం నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా దర్శన భాగ్యం కల్పిస్తాం. ప్రతిరోజు పూజలు, హోమాలు, అన్నదానం నిర్వహిస్తాం. ఆలయ పునరుద్ధరణ కమిటీ, భక్త బృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. – ఈఓ పి.లక్ష్మారెడ్డి

బీసీ రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలి



బీసీ యుద్ధబేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బండారు దత్తాత్రేయ

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలని మాజీ హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన రవీంద్రభారతిలో నిర్వహించనున్న 'బీసీల యుద్ధ బేరి'పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. అధికార కాంగ్రెస్ పార్టీ చట్టపరంగా కాకుండా పార్టీ పరంగా 42శాతం సీట్లు ఇస్తామని ప్రకటించడంతో ఆపార్టీకి అసలు బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలనే ఉద్దేశమే లేనట్లు ఉందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి ఇష్టం లేక సమస్యను పక్కదారి పట్టించడానికి ప్రయత్నిస్తోందన్నారు. కేంద్రంపై వ్యతిరేక ప్రచారం మానుకోవాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. బీసీలకు ఇచ్చిన హామీ మేరకు రిజర్వేషన్లు అమలు చేసే బాధ్యత కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.నందగోపాల్, జోషి రాఘవ, మాణిక్ ప్రభుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

షాదీముబారక్‌తో పాటు తులం బంగారం ఇవ్వాలి



హిమాయత్‌నగర్ మండల కార్యాలయంలో చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే ముఠాగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల మేలు కోసమే నాడు కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను తీసుకువచ్చారని గుర్తుచేశారు. హిమాయత్‌నగర్ మండల కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం షాదీముబారక్‌తో పాటు లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, బీఆర్ఎస్ నాయకులు ముఠా జై సింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్యామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం



కాచిగూడ రైల్వే స్టేషన్ ఎదురుగా ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కాచిగూడ: ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చట్ట ప్రకారం కేసులు బుక్ చేసి జైలుకు పంపిస్తామని సెంట్రల్, ఈస్ట్‌జోన్ ట్రాఫిక్–2 డీసీపీ ఎస్.శ్రీనివాస్ హెచ్చరించారు. కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగవారం కాచిగూడ రైల్వేస్టేషన్ ఎదురుగా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ 402 యాక్ట్ ప్రకారం ఫుట్‌పాత్‌లను ఆక్రమించొద్దన్నారు. అలా ఆక్రమించే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు చేపడుతున్న చర్యలకు స్థానికులు, వ్యాపారులు మద్దతు ఇవ్వాలని కోరారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడితే ఫోన్ నం. 87126 60646కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఎ.రాములు, ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్సైలు వీరమల్లు, జ్ఞానేశ్వర్, కేటి నాయక్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపుతోనే ఈడీ దాడులు

కవాడిగూడ: రాజకీయ కక్షలో భాగంలోనే ఆప్ ఢిల్లీ అధ్యక్షుడు సౌరవ్ భరద్వాజ్‌పై బీజేపీ ఈడీ దాడులు చేయిస్తోందని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్ ఆరోపించారు. మంగళవారం దోమలగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే ఈడీ దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు.

బాలిక అదృశ్యం

కాచిగూడ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తప్పిపోయిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చెప్పల్‌బజార్ ప్రాంతానికి చెందిన బాలిక బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి మంగళవారం కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్



విద్యార్థుల నృత్య ప్రదర్శన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగితేనే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ అన్నారు. మంగళవారం వీఎస్‌టీ ఫంక్షన్ హాల్‌లో న్యూఎరా కళాశాల ఆధ్వర్యంలో సంకల్ప్ దివాస్ పేరిట పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... లక్ష్యం లేని చదువులు వృథా అవుతాయని అన్నారు. ఆరేళ్లు కష్టపడి చదివితే 60 ఏళ్లు సుఖంగా జీవించొచ్చని అన్నారు. సెల్‌ఫోన్లకు కేటాయించే సమయాన్ని చదువు, ఆటలపైన కేటాయించాలని సూచించారు. ప్రేమ మత్తులోపడి మీ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ... క్రమశిక్షణ పట్టుదల ఉన్న ఏ విద్యార్థి ఓడిపోడని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

పునరావాస కేంద్రంలో సీఆర్‌సీ చైర్‌పర్సన్ తనిఖీలు

ముషీరాబాద్: ఆంధ్ర మహిళా సభ దుర్గాబాయి దేశ్‌ముఖ్ వికలాంగుల, వృత్తి శిక్షణ, పునరావాస కేంద్రాన్ని మంగళవారం చైల్డ్ రైట్స్ కమిషన్ (సీఆర్‌సీ) చైర్ పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి సందర్శించారు. అక్కడి విద్యాబోధన పునరావాసకేంద్ర నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. మానసిక వికలాంగుల పిల్లలకు బోధిస్తున్న తీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు వచన్‌కుమార్,వందనగౌడ్ చందన, అపర్ణ సరిత, హేమలత అగర్వాల్, త్రిమూర్తులు, శ్రీనివాస్‌రెడ్డి, ఆంధ్ర మహిళా సభ ప్రిన్సిపల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన చైర్‌పర్సన్...

పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు రూపుమాపడానికి సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓటీటీ, సోషల్ మీడియా పిల్లలపై ప్రభావం అనే అంశంపై పోస్టర్‌ను చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి ఆవిష్కరించారు.

ఆర్.కృష్ణయ్య సత్యాగ్రహ దీక్ష విజయవంతం

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేపట్టిన సత్యాగ్రహ దీక్ష పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యిందని ఆ సంఘం జాతీయ కో ఆర్డినేటర ర్యాగ అరుణ్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సత్యాగ్రహ దీక్షకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పార్టీలకు అతీతంగా హాజరైన నేతలు, కార్యకర్తలు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో రిజర్వేషన్లు సాధించే వరకు బీసీ ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేయనున్నట్లు ఆయన తెలిపారు. రిజర్వేషన్ల సాధన కోసం జరిగే పోరాటంలో బీసీలందరూ ఐక్యంగా ఉండి సంఘటిత శక్తిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు. జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని వెంటనే వీడాలన్నారు. లేని పక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాటం బీసీలు చెబుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు టి.రాజ్‌కుమార్, సాయిబాబా, నిఖిల్ పటేల్, నరేష్ గౌడ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బీజీయూఎస్ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా వినయ్‌కుమార్



చిక్కడపల్లి: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి (బీజీయూఎస్) సెంట్రల్ కమిటీ సభ్యునిగా ఎ.వినయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి ఉపాధ్యక్షుడు ఎం.వైకుంఠం, కార్యదర్శి ఆలెభాస్కర్‌రాజు మంగళవారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజీయూఎస్ కన్వీనర్ మద్దూరి శివాజి, కోకన్వీనర్లు మహేందర్‌బాబు, శక్తిసింగ్, బుర్ర రాజ్‌కుమార్, వెంకటేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి

భవన్స్ న్యూసైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కిషన్‌రావు

కాచిగూడ: విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి సామాజిక బాధ్యతతో కూడిన విద్యను అందిస్తున్నట్లు భవన్స్ న్యూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పేరాల కిషన్‌రావు అన్నారు. మంగళవారం నారాయణగూడలోని కళాశాలకు సీఆర్ఎస్‌పీ మెంబర్ ప్రొ. సత్యనారాయణను ఆహ్వానించారు. న్యాక్ గుర్తింపు సాధించేందుకు, నాణ్యతను మెరుగుపర్చేందుకు కళాశాల చేపట్టిన కార్యక్రమాలను ప్రెజెంటేషన్ ద్వారా ప్రిన్సిపాల్ వివరించారు. ఈ సందర్భంగా ప్రొ. సత్యనారాయణ అందించిన సూచనలు, మార్గదర్శకతను ఆయన స్వీకరించారు. ఇది కళాశాల భవిష్యత్ ప్రణాళికలు, కార్యక్రమాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.అలేఖ్య, కె.అర్చన, ఎ.మాధవి, సిహెచ్. శిరీష, వి.సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిరుపేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ రచనశ్రీ కోరారు. హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను మంగళవారం తహసీల్దార్ సంధ్యారాణితో కలిసి ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు జి. వెంకటేష్ , పరిమల్ కుమార్, సలంద్రి దిలీప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతుల పంపిణీ



గోల్నాకలో విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్







నల్లకుంట: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కోరారు. హెచ్ఎండీఏ సహకారం, హైదరాబాద్ సిటీజన్స్ ఫోరం(హెచ్‌సీఎఫ్), నల్లకుంట సిటీజన్స్ అసోసియేషన్(ఎన్‌సీఏ) సంయుక్తాధ్వర్యంలో మంగళవారం పాత నల్లకుంట స్ట్రీట్ నంబర్–14లో మట్టి గణపతుల పంపిణీ చేపట్టారు. దీనికి హాజరైన ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి స్థానికులు పర్యావరణ గణపతులను పంపిణీ చేసి మాట్లాడారు.

అంబర్‌పేట: గణేశ్ చవితి ఉత్సవాలకు సన్నాహాలు పూర్తి అయ్యాయి. నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న మార్కెట్లు పూజ సామగ్రి, గణపతి విగ్రహాల కొనుగోళ్లతో కళకళలాడాయి. అలాగే మంగళవారం పలువురు ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ అమృత





భాగ్యలక్ష్మినగర్, భోలక్‌పూర్‌హౌస్‌లో విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్



బండానగర్‌లో విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ జి.రచనశ్రీ